సాక్షి పెద్దపల్లి

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



కుదిరిన వేతన ఒప్పందం

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల అలవెన్సుల ఒప్పందం కుదిరింది. రూ.1,020 పెంచుతూ నిర్ణయించారు.

8లో▸



కూటమితో బీజేపీకి భయం

దేశానికి బీజేపీ పాలన నుంచి విముక్తి చేయడానికి ఇండియా కూటమి ఏర్పడిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై కనిపించినా.. ఉక్కపోత పెరుగుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్టీపీసీలో 1,062 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నెలలో 1,062 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు వరకు 7,102.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని 74.39 శాతం పీఎల్‌ఎఫ్‌తో పూర్తి చేసినట్లు వెల్లడించారు. 200 మెగావాట్ల మొదటియూనిట్‌లో 193, రెండో యూనిట్‌లో 183, మూడో యూనిట్‌లో 176, నాలుగో యూనిట్‌లో 413, ఐదో యూనిట్‌లో 479, ఆరో యూనిట్‌లో 461, ఏడో యూనిట్‌లో 509 మొత్తంగా 2,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులో ప్రస్తుతం 2,414 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు తెలంగాణ స్టేజీ–1లోని 800 మెగావాట్ల యూనిట్‌లో 600, 10 మెగావాట్ల సోలార్‌ప్లాంటులో మూడు మెగావాట్లు, 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటులో 53మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు సమాచారం.

నేటినుంచి ప్రత్యేక ఓటరు క్యాంపు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక క్యాంపు ద్వారా బూత్‌స్థాయి అధికారులు ఓటరు జాబితాతో అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో పేరులేని పక్షంలో ఫారం 6 నింపి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ అంధకారం చేస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్–1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జాక్టో ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు వ్యక్తం చేశారు. జాక్టో జిల్లా కన్వీనర్ మేరుగు సతీశ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోరుకునే దిశగా సరైన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాక్టో సభ్య సంఘాల ప్రతినిధులు తోట రాజు, మాధవచారి, లక్ష్మణ్, శ్రీకాంత్ రెడ్డి, ఆనందరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేశ్, సురేందర్ పాల్గొన్నారు.

సమ్మెకు తెలంగాణ ప్రజాఫ్రంట్ మద్దతు



మద్దతు తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద నేషనల్ హెల్త్‌మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కో– కన్వీనర్ గాండ్ల మల్లేశం ఉన్నారు. జిల్లా ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, కేకేవీఎస్ జిల్లా కార్యదర్శి రవీందర్, జిల్లా అధ్యక్షులు శ్రావణ్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

జ్యోతినగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో 2023–24 ఏడాదికి ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశాలకు గానూ దరఖాస్తు చివరి తేదీ గడువు పొడిగించినట్లు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ సీహెచ్.నాగేశ్వరావు, అంతర్గాం ఏఐ కో–ఆర్డినేటర్ ఇరుగురాల ఓదెలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందేవారు ఈ నెల 21లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత పత్రాలు ఆయా సెంటర్లలో అందించాలని తెలిపారు. సప్లిమెంటరీ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు రూ.25 అపరాధ రుసుంతో ఈనెల 4వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 9వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు.

‘జీవనజ్యోతి’.. ఆస్తులు జాస్తి!

- ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్య ప్రాపర్టీ విలువ రూ.60 కోట్లు
- వాటా క్లెయిమ్ చేసుకోని పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల సమాఖ్యలు
- పేరుకుపోయిన రూ.2 కోట్ల ఆస్తి పన్ను
- నోటీసులు జారీచేసిన ఐటీ శాఖ
- ఆగస్టు 31తో ముగిసిన గడువు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహిళా సమాఖ్యకు సంబంధించి ఓ ఆసక్తికర విషయం ఇపుడు తెరమీదకు వచ్చింది. ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్యకు సంబంధించి ఇంకా కొన్నిఆస్తులు విభజనకు నోచుకోలేదని, వాటి విలువ దాదాపు రూ.60 కోట్ల వరకు ఉంటుందన్నది దాని సారాంశం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పాత మహిళా సమాఖ్య ఆస్తులకు సంబంధించి దాదాపు రూ.2 కోట్ల ఆస్తి పన్నులు కట్టాలంటూ ఇటీవల ఐటీశాఖ నుంచి నోటీసులు వచ్చాయి. ఆగస్టు 31లోగా మొత్తాన్ని చెల్లించాలని గడువు కూడా విధించినట్లు సమాచారం. అది కట్టని పక్షంలో రూ.1.80 లక్షల చొప్పున జరిమానా కూడా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి సమాఖ్యకు సంబంధించిన అవిభాజ్య ఆస్తులపై మరోసారి చర్చ మొదలైంది.

రెండు దశాబ్దాల కింద మొదలై

2000వ దశకం ఆరంభంలో గ్రామీణ మహిళల్లో పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాల(సెల్ఫ్ హెల్ప్ గ్రూపు/ఎస్‌హెచ్‌జీ)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతీగ్రామంలో 10 నుంచి 15 మంది మహిళలతో ఒక స్వయం సహాయ సంఘం ఏర్పాటు చేశారు. ఇలాంటి 20 నుంచి 30 గ్రూపులను కలిపి గ్రామైక్య సంఘం లేదా విలేజ్ ఆర్గనైజేషన్ /వీవోగా పిలుస్తారు. వీటికి ప్రతినిధులుగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు ఉంటారు. వీవోలను కలిపి మండల స్థాయిలో మండల మహిళా సమాఖ్య, వీటిని కలిపి జిల్లాస్థాయిలో జిల్లా సమాఖ్యగా పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలో అప్పటి జిల్లా సమాఖ్యను జీవన జ్యోతి పేరుతో పిలిచేవారు. ఇవన్నీ సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(ఎస్‌ఈఆర్‌పీ లేదా సెర్ప్)కు అనుబంధంగా పనిచేస్తాయి. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని సమాఖ్యలో కరీంనగర్ సమాఖ్య కూడా ఆర్థికంగా బలంగా ఉండేది. మొదట్లో ఈ సమాఖ్యకు ఆర్థికంగా ప్రభుత్వం కూడా చేయూతనందించింది. ఇందుకోసం ఆరంభంలో కొంత గ్రాంటు ఇచ్చింది. తరువాత ఐకేపీ సెంటర్ల ద్వారా సేకరించిన ధాన్యం నుంచి క్వింటాలుకు రూ.32 కమీషన్ ఇచ్చేవారు. ఈ కమీషన్ పాత జిల్లా సమాఖ్య నుంచి మండల సమాఖ్య ద్వారా గ్రామైక్య సంఘాలకు చేరాలి. అదేవిధంగా కొందరు ప్రభుత్వశాఖలకు చెందిన ఉద్యోగులకు సైతం జిల్లా సమాఖ్య బ్యాంకు ఖాతా ద్వారా పంపిణీ చేసేవారు. అందుకు కూడా జిల్లా సమాఖ్యకు కమీషన్ సమకూరేది. అదేవిధంగా తిమ్మాపూర్ మండలంలో భారీగా గిడ్డంగులను నిర్మించి వాటిని సివిల్ సప్లై శాఖకు అద్దెకు ఇచ్చారు. వాటి నుంచి నెలానెలా రూ.లక్షల్లో కిరాయి సమకూరుతోంది. క్రమంగా వీరి లావాదేవీలు పెరిగి లాభాలు మొదలవడంతో ఆదాయపు పన్ను శాఖ పరిధిలోకి వచ్చాయని అప్పట్లో ఆడిటర్ సూచించారు. దీంతో అప్పటి నుంచి పన్ను కూడా చెల్లించారని తెలిసింది. అయితే 2015–2016 సంవత్సరంలో ఆడిటింగ్ జరగలేదని సమాచారం.

విడిపోయాక పంపకాలు జరగలేదా?

2016 అక్టోబరులోనే పాత కరీంనగర్ జిల్లా కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల అనే నాలుగు కొత్త జిల్లాలుగా విడిపోయింది. అదే సమయంలో ×జీవన జ్యోతి×గా ఉన్న ఉమ్మడి జిల్లా సమాఖ్య దాని ఖాతాలు, ఆస్తులు, వాటి నిర్వహణ అలాగే కొనసాగుతోంది. అది అలా ఉండగానే కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో ×శ్రీ సీతారామ జిల్లా సమాఖ్య× ఆవిర్భవించింది. ఇదేబాటలో కొత్త జిల్లాలైన సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి కూడా తమ కొత్త సమాఖ్యలు ఏర్పాటు చేసుకున్నాయి. ధాన్యం సేకరణ పెరగడంతో అవికూడా ఆర్థికంగా సుస్థిరత సాధించుకుంటున్నాయి. అయితే, జిల్లాల విభజన జరిగి ఏడేళ్లు కావస్తుండటంతో పాత సమాఖ్య సంగతి దాదాపుగా అంతా మర్చిపోయారు. ఉమ్మడి జిల్లా సమాఖ్యకు సంబంధించిన నగదు, స్థిర ఆస్తుల విలువ రూ.60 కోట్లపైమాటే ఉంటుంది. అయితే, పాత జిల్లా సమాఖ్య జీవనజ్యోతిలో తమ వాటా తేల్చాలంటూ ఇప్పటివరకూ సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల సమాఖ్యల నుంచి ఎలాంటి వినతులు రాకపోవడం విడ్డూరంగా ఉంది. రూ.60కోట్ల ఆస్తుల్లో సమానంగా పంచుకుంటు ఎంతలేదన్నా.. జిల్లాకు రూ.15 కోట్లకు తక్కవ కాకుండా పంపకాలు జరగాలి. అలాంటి ప్రతిపాదన రాకపోవడం, పంపకాలు కాకపోవడం గమనార్హం. అయితే, ఇపుడు ఉమ్మడి జిల్లా సమాఖ్య ఖాతా ఎవరి అధీనంలో ఉంది? దాన్ని ఎవరు నిర్వహిస్తున్నారు? దానికి వస్తున్న బ్యాలెన్స్‌షీట్ ఎవరు చూస్తున్నారు? తదితర ప్రశ్నలకు డీఆర్‌డీవో అధికారులనే సమాధానాలు చెప్పాలి.

మాకు సమాచారం లేదు

ఉమ్మడి కరీంనగర్ మహిళా సమాఖ్య ఆస్తుల పంపకంపై మాకు సమచారం లేదు. ఇప్పటి వరకూ మా వాటా కావాలని లేదా తేల్చాలని కొత్త జిల్లాల సమాఖ్య నుంచి ఎలాంటి వినతి, ప్రతిపాదనలు రాలేదు. అదే సమయంలో ఉమ్మడి సమాఖ్య ఆస్తులు పంపకం చేపట్టాలని హైదరాబాద్, సెర్ప్ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు.

– శ్రీలత, డీఆర్‌డీవో, కరీంనగర్

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్/గోదావరిఖనిటౌన్: అర్హులందరిని ఓటర్లుగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సూచించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాసకేంద్రం ఆడిటోరియంలో జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ.. ఓటరు నమోదు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. మరణించిన వారిని జాబితా నుండి తొలగించాలని, డబుల్ ఓటర్లుగా ఉంటే ఒకటి తొలగించాలని, 18 ఏళ్ల నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈనెల 2,3 తేదీలలో జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, బూత్‌స్థాయి అధికారులు ఓటరు జాబితాతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రాఫ్‌ఖాన్, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీ స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఓటుహక్కు సద్వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమతో పాటు తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితులు, బంధువులకు ఓటుహక్కు ప్రాధాన్యతను తెలియజేసి ఓటరుగా నమోదు చేసుకునే విధంగా చూడాలని పేర్కొన్నారు.

ధరణి, ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్

పెద్దపల్లిరూరల్: ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. జీవో 59 రుసుం వసూలు, జీవో 58,76 దరఖాస్తుల పరిశీలన, ధరణి పోర్టల్, ఇంటి పట్టాల పంపిణీ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. పెండింగ్ ధరణి సమస్యలు, మ్యూటేషన్ దరఖాస్తులు పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను వారంరోజుల్లో పరిష్కరించాలన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు సకాలంలో అందే విధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీవో 59 రెండోదశ కింద జిల్లాలో 840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 838 దరఖాస్తులు పరిశీలన పూర్తిచేశామని, రెండవ దశలో ఆమోదించిన దరఖాస్తుదారులు చెల్లించాల్సిన రుసుం వసూలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జీవో58 కింద రెండోదశలో 1,414 దరఖాస్తులు వచ్చాయని, 1,319 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, అర్హులకు పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు మధుమోహన్, వి.హనుమానాయక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏరియర్స్ కోసం ఎదురుచూపులు

- సమ్మెకు సైఅంటున్న కార్మిక సంఘాలు
- నెలరోజుల్లోగా చెల్లిస్తాం: ఎన్.బలరాం, డైరెక్టర్(పా)



గోదావరిఖని(రామగుండం): 11వ, వేజ్‌బోర్డు బకాయిల(ఏరియర్స్) చెల్లింపుకోసం సింగరేణి కార్మికులు ఎదురుచూస్తున్నారు. సంస్థవ్యాప్తంగా 40వేల పైచిలుకు కార్మికులు పనిచేస్తుండగా 11వ, వేతన బకాయిలు రూ.1726కోట్లు చెల్లించాల్సి ఉంది. సెప్టెంబర్ వేతనాలతో కలిపి ఏరియర్స్ చెల్లించాలని కోలిండియా యాజమాన్యం అన్ని సంస్థలను ఆదేశించింది. ఈ లెక్కన సింగరేణి కూడా ఈ నెల జీతాలతో చెల్లించాల్సి ఉంటుందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. వేతన ఒప్పందం ముగిసి మూడునెలలు కావస్తున్నా 23నెలల బకాయిల చెల్లింపుపై యాజమాన్యం స్పష్టమైన తేదీ ప్రకటించకపోవడంతో జాతీయ కార్మిక సంఘాలు సమ్మెకు సై అంటున్నాయి.

లాభాల వాటా చెల్లింపుపై రాని స్పష్టత

సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లింపుపై స్పష్టత రాలేదు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,220కోట్ల లాభాలు ఆర్జించినట్లు యాజమాన్యం పేర్కొంది. సాధించిన లాభాల్లో గతేడాది 30శాతం వాటా కార్మికకులకు చెల్లించారు. సింగరేణి చరిత్రలో ఈసారి భారీ లాభాలు ఉన్నాయి. వాటా చెల్లింపు శాతాన్ని ప్రభుత్వ పరంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించాల్సి ఉంది. లాభాల వాటా, వేజ్‌బోర్డు ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలని, కార్మికులు, కార్మిక నాయకులు కోరుతున్నారు.

యాజమాన్యం కసరత్తు

11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ రూ.1726 కోట్లు చెల్లింపునకు భారీ కసరత్తు ప్రారంభించింది. వేజ్‌బోర్డు 23నెలల ఏరియర్స్ ఒక్కో కార్మికుడికి సగటున రూ.4 లక్షల వరకు అందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సింగరేణి చరిత్రలో మొదటిసారిగా పెద్దమొత్తంలో వేతన బకాయిలను చెల్లిస్తున్న నేపథ్యంలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఉండేందుకు నెలరోజుల వ్యవధిలో రెండు విడతలుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది.

పకడ్బందీగా లెక్కింపు

వేతన బకాయిల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా పర్సనల్, అకౌంట్స్, ఆడిటింగ్, ఈఆర్‌పీ, ఎస్‌ఏపీ, ఐటీ విభాగాల సమన్వయంతో శుక్రవారం నుంచి ప్రారంభించారు. ముందుగా ఉద్యోగుల వేతన ఏరియర్స్‌పై ఆడిటింగ్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని, అనంతరం ప్రోగ్రామ్ రూపకల్పన, ఎస్ఏపీ టెస్ట్‌రన్లను కూడా తక్కువ సమయంలో పూర్తి చేసి చెల్లింపులకు మార్గం సుగమం చేయాలని నిర్ణయించారు.

నెలలో రెండు దఫాలుగా చెల్లింపు



సింగరేణి ఉద్యోగుల 11వ, వేజ్‌బోర్డు బకాయిలు నెల రోజుల్లోగా రెండు దఫాలుగా చెల్లించాలని నిర్ణయించాం. ఈ ఏడాది సుమారు రూ.1200 కోట్ల అదనపు వ్యయం అవుతోంది. ప్రస్తుతం చెల్లించే ఏరియర్స్ రూ.1726 కోట్లతో కలిపి మొత్తం దాదాపు రూ.3 వేల కోట్ల చెల్లింపులు ఉన్నాయి. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్న కార్మికులకు, పదవీ విరమణ చేసిన కార్మికులకు త్వరలో చెల్లిస్తాం.

– ఎన్.బలరాం, డైరెక్టర్(పా)

విత్తన బంతి.. హరిత కాంతి

- రామగుండం బల్దియాలో ‘సీడ్‌బాల్స్’
- ఆరేళ్లుగా వినూత్నంగా తయారీ
- అడవులు, గుట్టల్లో విసురుతున్న వైనం
- విత్తన బంతులతో గుట్టలకు ఆకుపచ్చ తోరణం
- ఈ ఏడాది కోసం 30వేలకుపైగా సీడ్‌బాల్స్ సిద్ధం



నర్సరీలో సీడ్ బాల్స్ తయారు చేస్తున్న సిబ్బంది



సీడ్ బాల్‌లో పెడుతున్న విత్తనాలు ఇవే

కోల్‌సిటీ(రామగుండం): అడవులు సహజ సిద్ధంగా తయారు కావాలి. గుంతలు తవ్వి, మొక్కలు నాటి అడవులు సృష్టించడం అసాధ్యం. ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన అడవి జీవవైవిధ్యానికి అద్దం పడుతుంది. ఇలాంటి అడవులను సృష్టించేందుకు రామగుండం నగరపాలకసంస్థ ఆరేళ్లుగా కృషి చేస్తోంది. విలక్షణమైన విత్తన బంతుల(సీడ్‌బాల్స్)కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. గుట్టలు, కొండల్లో పచ్చదనం కనుమరుగవుతున్న విషయాలను గుర్తించిన పాలకవర్గం, అధికారులు ఒకవైపు మొక్కలు నాటుతూనే మరోవైపు అడవులు, గుట్టలపై సీడ్ బాల్స్ విసిరి మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది 30వేలకుపైగా సీడ్ బాల్స్‌ను విసరడానికి సిద్ధం చేస్తున్నారు.

పూర్వీకులు చెప్పిన ‘సీడ్‌బాల్’ పద్ధతి

పండ్లు, కూరగాయలు, వివిధ రకాల చెట్ల గింజలను ఎండబెట్టి ఆ విత్తనాలను అడవులు, గుట్టలపై నాటడానికి మన పూర్వీకులు సీడ్‌బాల్స్ పద్ధతిని ఉపయోగించారు. సాంకేతిక విధానం రాకతో సీడ్‌బాల్ పద్ధతిని మర్చిపోయిన తరుణంలో జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త మసనోబు సీడ్‌బాల్స్‌ను మరోసారి పరిచయం చేశారు.

తయారీ ఇలా..

ప్రత్యేకంగా సంరక్షణ అవసరం లేకుండా ప్రకృతిసిద్ధంగా త్వరగా పెరిగే చెట్ల రకాలకు అధికారులు విత్తన బంతుల పద్ధతి అమలు చేస్తున్నారు. మన వాతావరణానికి అనుకూలమైన చింత, వేప, కానుగ, రెల్ల, కుంకుడు, ఏగిస మొదలైన చెట్ల నుంచి విత్తనాలు సేకరించి ఎర్రమట్టి, సేంద్రియ ఎరువు మట్టి ముద్దలుగా చేస్తారు. ఈ మట్టిముద్దల్లో విత్తనాలను పెట్టి నాలుగు, ఐదు రోజులపాటు నీడలో ఆరబెడతారు. తర్వాత వీటిని వర్షాలు కురిసినప్పుడు అడవులు, గుట్టలపై విసిరేయడంతో అవి మొలకెత్తుతాయి. బాల్‌లోని విత్తనానికి మంచిపోషకాలు కలిగిన ఎర్రమట్టి, సేంద్రియ ఎరువు బలాన్నిస్తుంది. అది భూమిలో ఇమిడిపోవడంతో మొక్క ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది.

ఆరేళ్ల క్రితం శ్రీకారం

తెలంగాణకు ఆకుపచ్చ తోరణం కట్టేందుకు ఉద్దేశించిన పథకం ‘హరితహారం’. రాష్ట్రంలో ఎటు చూసినా పచ్చదనం పరుచుకోవాలని, పల్లెలు, పట్టణాలు కళకళలాడాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షకు ప్రతిరూపం. ఈ నేపథ్యంలో రామగుండం నగరపాలక సంస్థ పాలకవర్గం గత ఆరేళ్ల క్రితం సీడ్‌బాల్స్ తయారు చేయడానికి శ్రీకారం చుట్టింది. స్థానిక శారదానగర్‌లోని నగరపాలక సంస్థ నర్సరీలో సీడ్ బాల్స్‌ను తయారు చేస్తున్నారు. ఈ విధానంపై నర్సరీలో సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొందారు.

30వేల సీడ్ బాల్స్‌సిద్ధం



నగరంలో విత్తన బంతుల ప్రయోగం సత్ఫలితాలిచ్చింది. తెలంగాణ హరితహారం కార్యక్రమంలో భాగంగా అవెన్యూ, స్కాటర్డ్, బ్లాక్ ప్లాంటేషన్‌లతోపాటుగా విత్తన బంతులు విసిరే కార్యక్రమం చేపడుతున్నాం. రామగుండాల గుట్టల్లో ఏటా ఈ విత్తన బంతులు విసురుతున్నాం. ఈ ఏడాది కూడా 30వేల విత్తనబంతులు తయారు చేయించాం. మరోదఫా వర్షాలు మొదలైన వెంటనే సమీపంలోని గుట్టల్లో ఈ విత్తన బంతులు విసరడానికి నగరపాలక సంస్థ సంసిద్ధంగా ఉంది. పండ్ల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వడంతో గుట్టల్లో ఉన్న కోతుల వంటి జంతువులకు ఆహారం దొరుకుతుంది.

– డాక్టర్ బంగి అనిల్‌కుమార్, మేయర్, రామగుండం

అభివృద్ధి పథంలో తెలంగాణ

- రామగుండంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం
- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



బైక్ పై ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ/గోదావరిఖని: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధిపథంలో దూసుకెళ్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం పోతనకాలనీ నుంచి యైటింక్లయిన్‌కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. 16వ డివిజన్‌లో రూ.30లక్షల నిధులతో సీసీరోడ్డు, మిషన్ భగీరథ పైపులైన్ పనులు ప్రారంభించారు. 17వ డివిజన్‌లో రూ.10 లక్షలతో శ్రీ రామ కళామండలి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్లు సాగంటి శంకర్, బాదె అంజలిదేవి, శంకర్ నాయక్, తాళ్ల అమృతమ్మ, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు రాంచందర్, గోపాల్ రావు, రాకేష్, శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కులసంఘాలకు భవనాలు

కులసంఘాలకు భవనాలు నిర్మిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కిందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని పరిధిలోని సప్తగిరికాలనీలో రూ.20 లక్షల నిధులతో నిర్మించనున్న మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీమేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆలన.. మూలన



ప్రజాసొమ్ము లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆరోగ్యశాఖ ఆలన వాహనం మూలన పడింది. ఏళ్లకాలంగా దుమ్ముపట్టిపోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కొత్తవాహనాలకు చిన్నచిన్న రిపేర్లు రావడంతో మరమ్మతు చేయించకుండా ఇలా మూలన పడేశారు. పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆలన వాహనం మూలనపడి ఇలా దుమ్ముధూళితో ఆఫీసుకు వచ్చేవారికి స్వాగతం పలుకుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

రామగిరి(మంథని): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుసాగాలని రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జేఎన్టీయూ కళాశాలలో నూతన విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేడు ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులే రేపటి ప్రత్యేక సాంకేతిక నిపుణులుగా తయారవుతున్నారని, మెదడుకు పదునుపెడితే ఫలితాలు వస్తాయని అనడానికి నిదర్శనమే చంద్రయాన్ అన్నారు. ప్రభుత్వ కళాశాలలో సీటు రావడం అదృష్టంగా భావించాలని, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో ప్రతి విషయాన్ని నిత్యం చర్చించాలని, హాజరుశాతం, క్రెడిట్స్ విధానం, డిటెన్షన్, గ్రేడింగ్, సెమ్‌ల కాలం, సౌకర్యాలను ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి వివరించారు. ఏపీఏ ఎస్‌వోటూ జీఎం డి.బైద్య, ఇఇఇ విభాగ అధిపతి దుర్గారావ్, జగన్నాథజెట్టి, పీడీ కృష్ణారెడ్డి, డీఇఇ సతీశ్, రవికుమార్, సుమన్ పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరావాలి



మాట్లాడుతున్న రామ్మోహన్

రామగుండం: భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు అందజేయాలని కోరుతూ ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లోని వెల్ఫేర్ బోర్డు కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ 2022 అసెంబ్లీ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికులకు మోటారు సైకిళ్లు, మహిళా కార్మికులకు స్కూటీలు అందజేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఊసేలేకపోవడం దారుణమన్నారు. దీంతో పాటు కార్మికులకు ప్రమాదబీమా, సహజ మరణాలు, పెళ్లి కానుకలు, ప్రసూతి సహాయం, తదితర అనే నష్ట పరిహారాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నింటిపై హైదరాబాద్‌లో వెల్ఫేర్ బోర్డు కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో కార్మికులు తరలిరావాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు తుంగపిండి మల్లేష్, నాయకులు వేల్పుల కుమారస్వామి, శ్రీనివాస్, కనకయ్య, మోహన్, కండె శ్రీనివాస్, కిరణ్, సత్యనారాయణ, అంజయ్య, జ్యోతి, గోలివాడ పోశం, భీమయ్య, లక్ష్మి, కనుకయ్య, గుంజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ధర్మారం: ధర్మారం మండలం మేడారం ఎస్సీకాలనీ సమీపంలోని మామిడితోటలో పేకాట స్థావరంపై శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారినుంచి రూ.10,500 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కార్మికులను కలిసిన కౌశికహరి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులను శుక్రవారం కార్మిక సంఘం నాయకులు కౌశికహరి కలిశారు. అనంతరం పాలకుర్తి గ్రామంలో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు కౌశికహరిని శాలువాతో సత్కరించారు. పాలకుర్తి ఉపసర్పంచ్ మాదాసు సతీశ్, పెద్దపల్లి నాగరాజు, హాజీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సకలజనుల సమ్మె స్ఫూర్తి సభలు

గోదావరిఖని: సకలజనుల సమ్మెస్ఫూర్తి సభలు ఈనెల 13నుంచి సింగరేణివ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ కోఆర్డినేటర్ మాదాసు రాంమూర్తి తెలిపారు. శుక్రవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి ఉద్యోగులు అత్యంత కీలక పాత్ర పోషించారన్నారు. గోదావరిఖని నుంచి ప్రారంభమై సింగరేణివ్యాప్తంగా సభలు నిర్వహించనున్నామన్నారు. కన్వీనర్‌గా కెంగర్ల మల్లయ్య, సభ్యులుగా సీనియర్ జర్నలిస్ట్ ఎండి మునీర్, హెచ్.రవీందర్, ఎం.వంశీ, ఆగయ్య, గోశిక మల్లేష్, పులిమోహన్, వెంకటేశ్వర్లుతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం టీటీసీలో శిక్షణ పొందుతున్న ట్రైయినీ ఫోర్‌మెన్‌లు, ఈపీ ఆపరేటర్లు, ఈపీ ఫిట్టర్లను కలిసి శిక్షణ తీరును తెలుసుకున్నారు. శిక్షణ సమయంలో ప్రతిఒక్కరు శ్రద్ధగా నేర్చుకుని మెలకువలతో తమ విధులను అంకితభావంతో నిర్వహించాలన్నారు. సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. జీఎం వెంట ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్‌రావు, టీటీసీ డీజీఎం వెంకటరమణ, ట్రైనింగ్‌ఆఫీసర్ ఆశోక్‌రావు పాల్గొన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు అలవెన్స్ రూ.1,020 పెంపు
- రీజనల్ లేబర్ కమిషనర్(సెంట్రల్) సునీల్‌కుమార్ సాహూ సమక్షంలో చర్చలు సఫలం



ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న కార్మిక నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల అలవెన్సుల ఒప్పందం అమలుపై శుక్రవారం హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్(సెంట్రల్) సునిల్‌కుమార్ సాహూ సమక్షంలో ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ యునైటెడ్ ఫోరం ప్రతినిధులు, ఎన్టీపీసీ రామగుండం అధికారులు, కాంట్రాక్టర్లతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. 2022 ఆగస్టుతో పాత వేతన ఒప్పంద కాలపరిమితి ముగియడంతో కొత్త వేతన ఒప్పందంపై పలు సంఘాల ప్రతినిధులు యాజమాన్యానికి డిమాండ్ నోటీసుతో పాటు సమ్మె నోటీసు అందించారు. పలు దఫాలుగా యాజమాన్యంతో పాటు ఆర్ఎల్‌సీ సమక్షంలో హైదరాబాద్‌లో చర్చలు జరిగాయి. చర్చల అనంతరం కాంట్రాక్టు కార్మికుడికి ప్రతినెల రూ.1,020 పెంచుతూ ఒప్పందం కుదిరింది. గడిచిన ఏడాదికి సంబంధించినచ బకాయిలు డిసెంబర్‌లోపు చెల్లించనున్నట్లు అంగీకరించారు. ఒప్పందంలో భాగంగా ప్లాంటులో విధి నిర్వహణలో మరణిస్తే యాజమాన్యం తరపున రూ.పది లక్షలు, కాంట్రాక్టర్ల ఇన్సూరెన్స్ ప్రకారం రూ.7.50 లక్షలు చెల్లించేందుకు, ప్లాంటు బయట మరణిస్తే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. కార్మికులకు నైట్ అలవెన్సు రూ.200 పెంపుదల కాగా ప్రస్తుత ఒప్పందం నాలుగు సంవత్సరాలు(2026)వరకు ఉంటుందని తెలిపారు. 11 డిమాండ్లకు సంబంధించిన ఒప్పందం అంగీకరించడంతో పాటు సంతకాలు చేశారు. చర్చల్లో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్సీసీ సభ్యులు బాబర్ సలీంపాషా, ఏజీఎం(హెచ్ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్, అధికారులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాతక్, ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రతినిధి కందుల స్వామి, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, శ్రీనివాస్, సత్యం, యం.శంకర్, నాగభూషణం, రాధారపు రాజమల్లయ్య, గణపతి, లక్ష్మారెడ్డి, కొమురయ్య, ఆర్.లక్ష్మణ్, కాంట్రాక్టర్లు దాడి శ్రీనివాస్, ఏబీసీరెడ్డి, ఎలిని నారాయణ, రాజేశం, వెంకటేశ్వరావు, సోమిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డితో పాటు పాల్గొన్నారు.

ఆంధ్రాలో దొరికారు..!

- పోలీసుల అదుపులో చందన
- ఆమె బాయ్‌ఫ్రెండ్ కూడా..
- దీప్తి అనుమానాస్పద మృతి కేసులో ప్రగతి

కోరుట్ల: సంచలనం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి(24) అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటనలో నిందితులుగా భావిస్తున్న బంక చందన (21), ఆమె బాయ్‌ఫ్రెండ్‌ను పోలీసులు శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పరిసరాల్లో తలదాచుకున్న వీరిద్దరినీ పోలీసులు పట్టుకుని కోరుట్లకు తరలిస్తున్నట్లు తెలిసింది.

మూడు రోజులుగా గాలింపు..!

- పట్టణానికి చెందిన బంక దీప్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే.
- అప్పటినుంచి ఆమె చెల్లెలు చందన పరారీలో ఉండటం కలకలం రేపిన క్రమంలో పోలీసులు ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు.
- అక్క దీప్తి చనిపోవడంలో తన ప్రమేయం లేదని చందన తన తమ్ముడు సాయికి వాయిస్ మేసేజ్ పంపిన క్రమంలో ఆమె సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.
- బుధ, గురువారాల్లో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు పోలీసు బృందాలు చందన ఆచూకీ కోసం హైదరాబాద్‌లో గాలించాయి.



సీసీ ఫుటేజీలో చందన(ఫైల్)

- అక్కడ నుంచి చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్ మకాం మార్చినట్లు గుర్తించినట్లు తెలిసింది. చందనతోపాటు ఆమె బాయ్‌ఫ్రెండ్‌కు పాస్‌పోర్ట్‌లు ఉండటం వారు రూ.2 లక్షల నగదు, సుమారు రూ.90 లక్షల విలువైన బంగారం ఇంటి నుంచి తీసుకెళ్లారని తండ్రి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో ఆ డబ్బుతో వారిద్దరూ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందన్న అనుమానంతో పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు.

హైదరాబాద్– బెంగళూర్ మార్గంలో.. ఆంధ్రాలో

బంక చందన బంధువులు ఒంగోలు జిల్లాకు చెందిన వారు కావడంతో ఆంధ్రప్రదేశ్‌కు ఆమె వెళ్లి ఉంటుందని భావించిన పోలీసులు ఆ దిశలో గాలింపు చేపట్టారు. హైదరాబాద్ నుంచి బెంగళూర్ మార్గంలో అనంతపురం, ప్రకాశం జిల్లా పరిసరాల్లో చందన ఆమె బాయ్‌ఫ్రెండ్ ఉన్నట్లుగా గురువారం రాత్రి పోలీసులు గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున చందన ఆంధ్రాలోని ప్రకాశం జిల్లా పరిసరాల్లో ఉన్నట్లుగా గుర్తించి పకడ్బందీ ప్రణాళికతో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి వారిద్దరిని కోరుట్లకు తీసుకువచ్చినట్లుగా తెలుస్తోంది. పోలీసుల అదుపులో ఉన్న చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్‌లు వాస్తవాలు వెల్లడిస్తే దీప్తి అనుమానాస్పద మృతి వెనుక అసలు నిజాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం విచారణ చేయనున్నట్లు సమాచారం.

అక్కాచెల్లెళ్లకు యావజ్జీవం

- చెల్లితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- మృతదేహానికి బండకట్టి బావిలో పడేసిన వైనం
- నంగెం ఘటనలో తీర్పు చెప్పిన కోర్టు

కోరుట్ల/జగిత్యాలక్రైం: ఆస్తి పంచి ఇవ్వడం లేదన్న నెపంతో భర్తను హత్య చేసిన భార్యకు, ఆమెకు సహకరించిన చెల్లెలుకు జగిత్యాల సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ శుక్రవారం యావజ్జీవ శిక్ష, రూ. 6వేల జరిమానా విధించినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2018 మార్చి 3వ తేదీన కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన గుంటి గంగమల్లయ్య(52) తన రెండో భార్య గుంటి దేవ(35)తో కలిసి పొలం వద్దకు వెళ్లి సాయంత్రం వరకూ రాలేదు. దీంతో అనుమానించి అతడి మొదటి భార్య కుమారుడు గుంటి మహేందర్ అప్పటి సీఐ సతీశ్‌చందర్‌రావుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన సీఐ.. మృతుడి రెండోభార్య గుంటి దేవతోపాటు కల్వకోటకు చెందిన ఆమె చెల్లెలు ఆదె రజితను నిందితులుగా గుర్తించారు. అనంతరం వారిని విచారించగా గుంటి దేవ తన చెల్లెలు రజితతో కలిసి పొలం పనుల ముగిసిన తర్వాత భర్త గుంటి గంగమల్లయ్యపై వెనుక నుంచి దాడి చేసి కత్తితో మెడ కోసి హత్య చేసినట్లు తేలింది. హత్య చేసిన తర్వాత గంగమల్లయ్య మృతదేహం నడుముకు చీరతో బండ కట్టి వ్యవసాయ బావిలో పడేశారు. ఆస్తి కోసమే హత్య చేసినట్లు ధ్రువీకరించిన అప్పటి కోరుట్ల సీఐ సతీశ్‌చందర్‌రావు.. 302, 201 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద వీరిని అరెస్టు చేయగా జగిత్యాల సెషన్స్ కోర్ట్‌లో విచారణ సాగింది. గుంటి దేవ, రజిత కలిసి గంగమల్లయ్యను హత్య చేసినట్లుగా సీఐ సతీశ్‌చందర్‌రావు, పీపీ మల్లి కార్జున్ కోర్టులో సరైన సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. దీంతో జగిత్యాల సెషన్స్ కోర్ట్ జడ్జి నీలిమ శుక్రవారం తుది తీర్పు వెల్లడించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, నిజాలు నిర్భయంగా కోర్టుకు వచ్చి చెపితే నిందితులకు త్వరితగతిన శిక్షలు పడతాయన్నారు.

అత్యాచారం నిందితులను శిక్షించాలి

- తీవ్రమైన రక్తస్రావంతోనే బాలిక మృతి
- ఎలుకల మందు తాగిందని నమ్మించే ప్రయత్నం
- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

సాక్షి,పెద్దపల్లి: వలసకూలీపై అత్యాచారం చేసి మృతికి కారణమైన హంతకులను కఠినంగా శిక్షించాలని భారతకమ్యూనిటీ పార్టీ(మావోయిస్టు) జయశంకర్, మహబూబాబాద్, వరంగల్–2, పెద్దపల్లి(జెఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం పత్రికాప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పీడిత ప్రజలకు రక్షణలేకుండా పోయిందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు పొట్టకూటికోసం పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వెంచర్‌లో భవన కూలీలుగా పనిచేస్తున్నారని, వలసకూలీలతో ఒప్పందం చేసుకుని దళారులు ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారన్నారు. వీరిపై గతంలో అత్యాచారాలు జరిగాయన్నారు. రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో పనిచేస్తున్న బాలికను ఒకవ్యక్తి తన ఇంటిలో పనిఉందని మేస్త్రీకి చెప్పి తీసుకవెళ్లి మరోముగ్గురితో కలిసి నోటిలో గుడ్డలు కుక్కి సామూహిక అత్యాచారం చేసి పెద్దపల్లి బస్టాండ్‌లో వదిలివెళ్లారన్నారు. అప్పన్నపేట గ్రామానికి చెందిన వారు గుర్తించి రియల్ ఎస్టేట్ వద్దకు తీసుకెళ్లి అక్కాబావలకు అప్పగించారని, ఈవిషయాన్ని మేస్త్రీకి చెప్పగా ఎక్కడైనా చెబితే చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. తీవ్రరక్తస్రావం జరిగినప్పటికీ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వాళ్లను బెదిరించి వాహనంలో ఎక్కించి మధ్యప్రదేశ్‌కు తరలించారన్నారు. ఈక్రమంలో మార్గమధ్యంలో మరణించిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు యాజమాన్యానికి అండగా ఉండటంతో ఏం చేసినా చెల్లుతుందని విర్రవీగుతూ ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు.

వేలాది సీసీ కెమెరాలు..

తెలంగాణలో ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే తెలిసేవిధంగా వేలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, సాధారణ వ్యక్తులు ఏం చేసినా అవి రికార్డు అవుతాయని, అదే పోలీసులు, అధికారులు, యంత్రాంగం, రాజకీయనాయకులు ఏంచేసినా అవి రికార్డు కావన్నారు. బాలికను బస్టాండ్‌లో పడేసిపోయిన సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదన్నారు. ఘటనను పక్కదారి పట్టించేందుకు అత్యాచారం చేసిన బాధితులు, మేస్త్రీ కూలీ కుటుంబాన్ని బెదిరించి మధ్యప్రదేశ్‌కు తరలిస్తుండగా తీవ్ర రక్తస్రావంతో బాలిక మార్గమధ్యంలో చనిపోయింది కానీ.. ఎలుకల మందు తాగి మృతి చెందిందని ప్రజలను నమ్మించాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వమే బాధ్యత వహించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఏరియర్స్ చెల్లించకుంటే సమ్మె నోటీసు ఇస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



ఆర్జీ–1 జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు రావాల్సిన 11వ వేజ్‌బోర్డ్ ఏరియర్స్ సెప్టెంబర్‌లో చెల్లించకుంటే సమ్మెనోటీసు ఇస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొగ్గుగని కార్మికుల వేజ్ బోర్డు ఒప్పందం జరిగి మూడు నెలలు గడిచినా ఏరియర్స్‌పై క్లారిటీ రాలేదన్నారు. 23 నెలల ఏరియర్స్ కార్మికులకు చెల్లించాల్సి ఉందని, కోల్ ఇండియా యాజమాన్యం సెప్టెంబర్ 1న అక్కడి కార్మికులకు చెల్లిస్తే, సింగరేణి యాజమాన్యం చెల్లించలేదన్నారు. కార్మికులు కష్టపడి లాభాలు తీసుకువస్తే వాటిని యాజమాన్యం వేతనాలకు, బకాయిల చెల్లింపు కోసం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వానికి దారాదత్తం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.29వేల కోట్ల బకాయి ఉందని, ఆ బకాయిలు చెల్లించక పోవడంతో ఏరియర్స్ చెల్లించేందుకు యాజమాన్యం వద్ద డబ్బు లేదని, బ్యాంకుల్లో బాండ్‌లు పెట్టి అప్పు తెస్తామన్న కంపెనీలో బాండులు లేవని, ఉన్న బాండులు ఇదివరకే జీతాల కోసం బ్యాంకులో కుదువ పెట్టారన్నారు. సింగరేణికి వచ్చిన లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌కు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కే.స్వామి, పోషం, రంగు శ్రీనివాస్, మహేష్, అశోక్, బోగ సతీష్‌బాబు, దొంత సాయన్న, ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

- గతనెల 26న ఓ కేసుకు భయపడి ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్సై వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ వివాహిత గతనెల 23న పశువులు మేపడానికి అడవికి వెళ్లింది. అటుగా వెళ్లిన ఇదే గ్రామానికి చెందిన కొంకిమల్ల వికాస్(26) ఆ వివాహితపై లైంగిక దాడికి యత్నించాడు. ప్రతిఘటించడంతో రాయితో దాడిచేశాడు. ఈ ఘటనపై కాల్వశ్రీరాంపూర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. తనకు జైలుశిక్ష పడుతుందని భయపడిన వికాస్ ఆగస్టు 26న పురుగుల మందు తాగాడు. తన చావుకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారణమని సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆగస్టు 31న చనిపోయాడు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపాడు.



వికాస్(ఫైల్)

బొగ్గుబాయి వార్తలు

ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలి

- రూ.29కోట్లతో సీవరేజ్ ప్లాంట్
- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలపాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 17.27లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 16.23లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల్లో 94శాతంలో నిలిచామన్నారు. ఆగస్టులో 3.14లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గానూ 3.08లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 98శాతంలో నిలిచినట్లు వెల్లడించారు. రామగుండం రీజియన్‌లోని కార్మిక కుటుంబాలకు పరిశుభ్రమైన మంచినీటిని అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వచ్చేనెలలో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. అలాగే రూ.29కోట్లతో 17ఎంఎల్‌డీ కెపాసిటీతో నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సీవరేజ్ ప్లాంట్ 60శాతం పూర్తయ్యిందని, మార్చినెలలోగా పూర్తికానుందన్నారు. ఇది పూర్తయితే డ్రైనేజీ నీటిని శుభ్రం చేసే పక్రియ ప్రారంభం అవుతుందన్నారు. జీడీకే–5 ఓసీపీలో నిర్దేశిత లక్ష్యాలకు మించి 113శాతం బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కృషిచేసిన అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. అధికారులు రాంమోహన్, రాంమూర్తి, అంజనేయులు, కిరణ్‌రాజ్‌కుమార్, చంద్రశేఖర్, మధన్‌మోహన్, నాగేశ్వర్‌రావు, ధనలక్ష్మిబాయి, అంజనేయప్రసాద్, హన్మంతరావు, సారంగపాణి, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ- 3లో 100శాతం ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి(మంథని): ఆర్జీ–3 డివిజన్‌లో ఆగస్టులో 100శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం సుధాకర్‌రావు తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టులో ఆర్జీ–3 ఏరియాకు నిర్దేశించిన 3.90 లక్షల టన్నులకు గాను 3.89 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగిందని తెలిపారు. 95శాతం ఓబీ వెలికితీశామని, 5.85 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. ఓసీపీ–2 పరిధిలో గని భవిష్యత్తు దృష్ట్యా నిర్వాసిత గ్రామాల ప్రజలు సహకరించాలని, పరిహారం విషయంలో సంస్థ తోడ్పాటు అందిస్తుందని అన్నారు. ఏపీఏ గనిలో 48శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఎస్‌వోటూ జీఎం బైద్య తెలిపారు. నిర్దేశించిన లక్ష్యం 1.48 లక్షల టన్నులకు గాను 0.72 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 0.87 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందని తెలిపారు. సాంకేతిక అవంతరాల వల్ల బొగ్గుఉత్పత్తిలో వెనుకంజలో ఉన్నామని, భవిష్యత్తులో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమిస్తామని అన్నారు. ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఐఈ డీజీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ కె.రవీందర్ రెడ్డి, డీవైపీఎంలు మారుతి, గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

రామగుండంలో పర్యటించిన చీఫ్ సెక్యూరిటీ అధికారి



ఓసీపీ-3 క్వారీ పరిశీలిస్తున్న చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజు

గోదావరిఖని: సింగరేణి చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజు శుక్రవారం రామగుండం రీజియన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్జీ–1 ఏరియాలో చెక్‌పోస్టులు తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆర్జీ–2 ఏరియాలోని అన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఓసీపీ–3 క్వారీలోకి వెళ్లి చోరీలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను దిశానిర్దేశం చేశారు. క్వారీ ఏరియాలో కేబుల్ దొంగల వల్ల ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంటనే ఆర్జీ–1 సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఆర్జీ–2 సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్ ఉన్నారు.

కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి కార్మికుల ఆరోగ్యానికి యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఓసీపీ–2లో రామగుండం ఏరియా అసుపత్రి ఆధ్వర్యంలో కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించారు. కరోనా తర్వాత వయస్సుతో సంబంధం లేకుండా చాలామంది గుండెపోటుతో మరణిస్తున్నారని, మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు దీనికి ప్రధాన కారణామని తెలిపారు. కార్మికుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధతో ఈ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ క్యాంపుల ద్వారా పరీక్షలు చేయించుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలుంటే ముందుగానే గుర్తించి ప్రాణహాని నుంచి బయటపడొచ్చని తెలిపారు. కార్మికులందరూ ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్జీ ఏరియా అసుపత్రి డీసీఎంవో కిరణ్‌రాజ్, ఏరియా భద్రత అధికారి వెంకటరమణ, గని మేనేజర్ రామరావు, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, డీవైపీఎం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇండియా కూటమితో బీజేపీకి భయం

- అందుకే జమిలి అంటూ కొత్తరాగం
- పొత్తులు ఎలా ఉన్నా ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: దేశానికి బీజేపీ పాలన నుంచి విముక్తి చేయడానికి ఇండియా కూటమి ఏర్పడిందని, అప్పటి నుంచి బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే జమిలి ఎన్నికలంటూ కొత్తరాగం పాడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో దేశంలో అస్థిరత ఏర్పడిందని అన్నారు. బీజేపీని గద్దెదించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న మెజార్టీ ప్రతిపక్షాలన్నీ కలిసి ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. దీంతో బీజేపీఈకి వణుకు పుట్టిందని, జమిలి ఎన్నికలు జరపాలని కొత్తరాగం తీయడం దానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ ఆధ్వర్యంలో కమిటీ వేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని నిలువరించడానికి మునుగోడులో బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చామని, ఈ మద్దతు ఇలాగే కొనసాగిస్తామని బహిరంగ సభలో స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పి ఇప్పుడు మాట మార్చాడని, మిత్రధర్మం మరిచాడని, అంతర్గతంగా బీజేపీతో దగ్గరవుతున్నాడని అనుమానం కలుగుతోందని అన్నారు. జాతీయ పార్టీ సూచన మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 11 నుంచి 17వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరపాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వివిధ జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, కర్రె భిక్షపతి, తాండ్ర సదానందం, గుంటి వేణు, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోనగంటి కేదారి తదితరులు పాల్గొన్నారు.